'హమ్ ఫిట్ తో భారత్ ఫిట్' సైకిల్ ర్యాలీ


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: విద్యార్థులందరూ చదువుతో పాటు ఆరోగ్యవంతమైన జీవితం కోసం కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'హమ్ ఫిట్ తో భారత్ ఫిట్' కార్యక్రమంలో భాగంగా 5కె సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇప్పించాలన్నారు. పాఠశాల నిర్వాహకులు రితేష్, రూపేష్, హైదరాబాద్ సైకిలిస్ట్ గ్రూప్ నిర్వాహకులు నందనూరి రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తనుశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులందరికీ సమాన హక్కులు కల్పించాలి


తమ్మినేనితో దళిత జన సమితి సభ్యులు

మల్లాపూర్: సీపీఎం అఖిల భారత కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రంను దళిత జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికుల హక్కులు, అందరికీ సమానంగా ఉండేలా రిజర్వేషన్లపై చర్చించినట్లు ఆయన తెలిపారు. దళిత జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, బీసీ సంఘాల నేతలు గంగాధర్, సంపత్, అశోక్, కిష్టయ్య తదితరులున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

అల్వాల్: మానసిక వేదనతో వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం హస్మత్‌పేట్ చక్రిగడ్డలో నివాసముండే ఏ.భాగ్యమ్మ(57) భర్త రామస్వామి 5 సంవత్సరాల క్రితం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త చనిపోయినప్పటి నుంచి తీవ్ర మనోవేదనతో ఉందని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఏడాది క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిందని వారు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్‌లో చైన్ స్నాచింగ్!


బాధితురాలు విజయలక్ష్మి

ఉప్పల్: పాల ప్యాకెట్ కోసం వచ్చి మహిళ మెడలో నుంచి మంగళసూత్రాన్ని స్నాచింగ్ చేసిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ విజయపురికాలనీలో నివాసం ఉంటున్న విజయలక్ష్మి(40) రోజువారీగా సరస్వతినగర్‌లో పాల ప్యాకెట్లను విక్రయించేందుకు వచ్చింది. అంతలోనే ఓ ఆగంతకుడు పాల కోసం వచ్చినట్లుగా నమ్మించి ఆమె మెడలో ఉన్న మూడు తులాల మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయాడు. రక్షించుకునే ప్రయత్నంలో మహిళకు గాయాలయ్యాయి. బాధితురాలు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించని ఆసుపత్రి సీజ్

రూ. 5 లక్షల జరిమానా విధించిన వైద్యాధికారులు

మల్కాజిగిరి: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆసుపత్రిపై జిల్లా వైద్యాధికారులు కొరఢా ఝులిపించారు. వేంకటేశ్వరనగర్‌లోని ఓ ఆసుపత్రిలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరీ సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలు లోపాలను గుర్తించామన్నారు. పీసీ పీఎన్ డీటీ సర్టిఫికేట్ (భ్రూణహత్యలు నిరోధ చట్టం) గడువు ముగిసిన తర్వాత కూడా సేవలందించారని, ప్రజలకు కనిపించే విధంగా సేవల ధరల పట్టికలేకపోవడం, డాక్టర్ల జాబితాలో తప్పుడు ప్రచారం, అనధికారికంగా అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఉపయోగించడంతో పాటు పాలీక్లినిక్‌ను అనుమతిలేకుండా నిర్వహించడాన్ని కూడా గుర్తించామన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన ఆదేశాల మేరకు రూ. 5 లక్షల జరిమానాతో పాటు 60 రోజులు ఆసుపత్రి లైసెన్స్‌ను రద్దు చేస్తున్నామన్నారు. పోలీసుల సమక్షంలో ఆసుపత్రిని సీజ్ చేశామన్నారు. ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

'రాజీవ్ యువ వికాసం'తో

పేదలకు చేయూత

● ఉప్పల్ సర్కిల్‌లో 4 కేంద్రాల ఏర్పాటు ● ఈనెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణ

రామంతాపూర్: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ దరఖాస్తుల సమర్పణ చివరి తేదీ ఈనెల 14న ముగుస్తుంది. ఉప్పల్ సర్కిల్‌లోని 4 డివిజన్లలో దరఖాస్తు పత్రాల స్వీకరణకు 4 కౌంటర్లను ఏర్పాటు చేశారు. రామంతాపూర్ డివిజన్ వివేక్‌నగర్, కమ్యూనిటీహాల్ వార్డు కార్యాలయం, ఉప్పల్ డివిజన్ సరస్వతినగర్ వార్డు కార్యాలయం, చిలుకానగర్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీ వార్డు కార్యాలయం, హబ్సిగూడ డివిజన్ వీధి నెంబర్–8 గాంధీ గిరిజన బస్తీ వార్డు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

ఈ పథకానికి అర్హతలు

గ్రామీణ ప్రాంతాల వారికి 1.5, పట్టణ ప్రాంతాల వారికైతే రూ. 2 లక్షల వార్షిక ఆదాయం ఉండాలి. వ్యవసాయేతర యూనిట్లైతే 21 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వరకు, వ్యవసాయ ఆధారిత యూనిట్లకు 21 నుంచి 60 ఏళ్లు ఉండాలి. ఇంటికి ఒకరికే ఈ పథకం వర్తిస్తుంది.

రూ. 50,000 నుంచి రూ.4 లక్షల వరకు..

రాజీవ్ వికాస్‌కు తాము ఎన్నుకున్న ఉపాధి పథకాలను బట్టి రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు ఆర్థికసాయం ప్రభుత్వం అందజేస్తుంది. దీంట్లో రూ.50 వేలకు 100 శాతం సబ్సిడీ, మిగతా వాటికి 60 నుంచి 80 శాతం సబ్సిడీ లభిస్తుంది.

దరఖాస్తులకు జతచేయాల్సిన పత్రాలు..

యువ వికాసానికి దరఖాస్తు చేసుకునే వారు ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు, లేకపోతే నూతన ఆదాయ ధ్రువీకరణపత్రం, రేషన్‌కార్డు ఉంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదు. కుల ధ్రువీకరణ కోసం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రాలు, కార్లు ఇతర రవాణా వాహనాల కోసం దరఖాస్తు చేసుకునే వారైతే డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ ఆధారిత యూనిట్ల కోసం పట్టాదారు పాస్‌పుస్తకం, దివ్యాంగులైతే సదరన్ సర్టిఫికెట్ జత చేయాలి. పాన్‌కార్డు తప్పనిసరి కాదు, ఉంటే జత చేయొచ్చు. మొబైల్ నెంబర్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో ఇవన్నీ జత చేయాలి.

ఉపాధి యూనిట్లు..

హోటల్, మినీ సూపర్ బజార్, చీరల వ్యాపారం, స్వీట్ షాప్, గిఫ్ట్ షాప్ పండ్లు, కూరగాయాల దుకాణం, డిష్ టీవీ, ఎలక్ట్రికల్ బ్యూటీ పార్లర్, బేకరి ఫాస్ట్‌ఫుడ్ పిండిమర పంపుసెట్లు, ఎయిర్ కంప్రెసర్‌తో పాటు వ్యవసాయ ఆధారిత గేదెల పెంపకం, ఆవుల పెంపకం, మేకల పెంపకం, నాటుకోళ్ల పెంపకంతో పాటు రవాణా వాహనాలు, ఇంటర్నెట్, ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్లు తదితర స్కీములు ఉన్నాయి.

☛ వ్యాపార, వ్యవసాయానికి సంబంధించిన మరో 75 యూనిట్లు కూడా అందుబాటులో ఉన్నాయి.



వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలి..

రాజీవ్ యువ వికాసం కోసం మీ సేవా ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అనంతరం ఫారమ్‌తో పాటు ఇతర సర్టిఫికెట్లను ఉప్పల్ సర్కిల్ పరిధిలో అన్ని డివిజన్ వార్డు కార్యాలయ కౌంటర్లలో అందజేయాలి. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 వరకు కౌంటర్లు పనిచేస్తాయి. ఇప్పటి వరకు ఈ పథకానికి 65 మంది దరఖాస్తు చేసుకున్నారు.

–ఆంజనేయులు, ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మేడిపల్లి మండల సీపీఐ ప్రధాన కార్యదర్శి రచ్చ కిషన్ సోమవారం కమిషనర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. పలు డివిజన్లలో అక్రమ సెల్లార్లు, బహుళ అంతస్తులు, ఎలాంటి అనుమతులు లేని షట్టర్ల నిర్మాణం, వక్ఫ్‌బోర్డు స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, సీపీఐ నాయకులు మోహన్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు చెక్కు అందజేత


కేటీఆర్‌కు చెక్కును అందజేస్తున్న చిగుళ్ల శ్రీనివాస్

మల్లాపూర్: ఈనెల 27న జరగబోయే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిగుళ్ల శ్రీనివాస్ (హమాలీ శ్రీను) ఆధ్వర్యంలో రూ.1,14,000 చెక్కును సోమవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అందజేశారు. కె.అశోక్, రమేష్, సీహెచ్. అశోక్ తదితరులున్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం


అల్వాల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

అల్వాల్: అల్వాల్‌కు చెందిన దివంగత గణేష్‌గౌడ్ జ్ఞాపకార్థం సాయిరామ్‌గౌడ్ ఆధ్వర్యంలో అల్వాల్ ఇందిరాగాంధీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షుడు అశోక్, నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, ఉదయ్, లక్ష్మీకాంత్, మహిళా నాయకురాళ్లు, స్థానిక నేతలు తదితరులున్నారు.

మల్లాపూర్: ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మల్లాపూర్ నాగలక్ష్మినగర్ మెయిన్‌రోడ్డులో కాంగ్రెస్ సీనియర్ నేత కొయలకొండ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా ఎస్సీసెల్ సలహాదారులు పీజీ.సుదర్శన్, మల్లాపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బండి సంపత్‌గౌడ్, రాహుల్, మైథిలి, సాయితేజ, నవీన్, సాయిరామ్‌గౌడ్, సాయిరెడ్డి, సూరజ్, అజామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మేడిపల్లిలో సోమవారం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. మానవాళికి ఏకైక ఆదర్శం హనుమంతుడని, ఆయన స్థిరత్వానికి ప్రతీకని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో హనుమంతుడి జీవితాన్ని ప్రేరణగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పవన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రాముయాదవ్ తదితరులున్నారు.


స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

తాగునీటి సమస్యపై కార్పొరేటర్ సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట–హెచ్‌బీకాలనీ పరిధిలో తాగునీటి సరఫరా సమస్యలపై కార్పొరేటర్ ప్రభుదాస్ సోమవారం జలమండలి జీఎం సంతోష్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలం దృష్ట్యా పలు కాలనీలో మెరుగైన తాగునీటి సరఫరా కోసం మరిన్ని జంక్షన్ల ఏర్పాటు, పలు కాలనీల్లో డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరుతుందని తదితర సమస్యలను పరిష్కరించాలని ఆయన జలమండలి అధికారులకు సూచించారు. జలమండలి డీజీఎం సతీష్, ఏఈ వేణుగోపాల్, కాలనీల అధ్యక్షులు శివరాంప్రసాద్, వెంకటాచారి, అహ్మద్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.70 కోట్లతో అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లను పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌తో కలిసి రూ.1.70 కోట్ల నిధులు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హనుమాన్‌నగర్ నుంచి బండచెరువు వరకు బాక్స్ డ్రెయిన్ నిర్మించనున్నట్లు చెప్పారు. ఈఈ మాధవిలత, బీజేపీ నేతలు గున్నాల చంద్రశేఖర్, మౌలాలి డివిజన్ అధ్యక్షుడు శివగౌడ్, లింగారావు, శ్రీనివాస్, నటరాజ్, ఖుద్దూస్, వంశీరెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరోగ్య దినోత్సవం

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ఆరోగ్యంపై వ్యయాలు రోజు రోజుకు పెరిగి పెనుభారమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైస్ ప్రిన్సిపాల్ చెప్పారు. నిత్యం యోగా, నడక వంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. కో– ఆర్డినేటర్ గీత, డా.తిరుపతయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



వార్షికోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

మల్కాజిగిరి: కృష్ణవేణి పాఠశాల వార్షికోత్సవం శ్రీదేవి ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. గతేడాదిలో పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చైర్మన్ సంగాని రాజు, జోనల్ చైర్మన్ బుచ్చిరెడ్డి, డైరెక్టర్ మంచాల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ హారిక తదితరులున్నారు.

హనుమయ్యకు ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు హనుమయ్య

మల్కాజిగిరి: మల్కాజిగిరికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు హనుమయ్యను సంగమం (కళావేదిక) ఉగాది పురస్కారం లభించింది. నగరంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాల ఎంపిక కమిటీ చైర్మన్ హర్షవర్ధన్, ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, ప్రముఖ నటి విజయ హనుమయ్యను సత్కరించి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు హనుమయ్య ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పన, ఎస్‌సీసీ ద్వారా విద్యార్థులను జాతీయస్థాయిలో గుర్తింపు రావడానికి కృషి చేయడంతో పాటు తన సొంతనిధులతో సొంత గ్రామంలో లైబ్రరీ నిర్మించారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి వార్షికోత్సవ వేడుకలు



గౌతంనగర్: డివిజన్ పరిధి వాణినగర్‌లోని విజయ వినాయక ఆలయంలో దత్తాత్రేయ స్వామివారి 15వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి 108 లీటర్ల పాలతో భక్తులు స్వామివారికి సామూహికంగా అభిషేకం, విశేష పూల అలంకరణ, అర్చనలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, బిక్ష సమర్పణ, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ అనంతరం సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు. కాంగ్రెస్ బి–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సిరిగిరి రాజు, సభ్యులు జీనయ్య, బలరాం, వీరభద్రరావు, పార్థు, సురేష్‌సింగ్, సంజయ్, శ్రీకాంత్, రాము, నరేష్ తదితరులున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఏప్రిల్ 21న జరగబోయే తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డిల చేతులమీదుగా విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండస్వామి, అధికార ప్రతినిధి గగన్‌కుమార్, ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు దయానంద్, భాస్కర్, శివకుమార్, సత్యనారాయణ, శోభన్‌బాబు, ముత్యాలు, మల్లేష్‌చారి, సుధీర్, సతీష్, వెంకటేష్, సరిత, రమేష్, ఆంజనేయులు, గణేష్, శ్యామ్‌కుమార్, రమేష్‌చారి తదితరులున్నారు.


ప్లీనరీ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ శాంతి

ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ వేడుకలు


మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దళిత సంఘాల నేతలు

మల్లాపూర్: దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నాచారం అన్నపూర్ణ కాలనీ అంబేడ్కర్ కమ్యూనిటీహాల్ వద్ద డీఎస్ జేఏసీ కన్వీనర్ కరాటే శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ హాజరై మాట్లాడారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నెల రోజుల పాటు జిల్లా అంతటా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాచారం దళిత సంఘాల జేఏసీ వ్యవస్థాపకులు నల్లా రాధాకృష్ణ, సంజన్న, అంజి మాదిగ, నల్లబాబు, దేవులపల్లి యాదగిరి, సంతోష్, శివ, రమేష్, రాంచందర్, వెంకటేష్, ప్రమోద్‌కుమార్ తదితరులున్నారు.

ప్రేమించిన అమ్మాయితో పెళ్లికి నిరాకరించారని..

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి

జవహర్‌నగర్/మేడిపల్లి: ప్రేమించిన అమ్మాయితో పెళ్లి కాలేదని ఓ యువకుడు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గత నెల మార్చి 28న పెళ్లి విషయంలో ఇంట్లో గొడవపెట్టుకుని సాయిపవన్ (28) అనే యువకుడు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. జవహర్‌నగర్‌కు చెందిన సాయిపవన్ మేడిపల్లిలో నివాసం ఉంటున్న ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. ఈ క్రమంలో మార్చి 30న యువతి నివాసానికి వెళ్లి ఆ అమ్మాయితోనే వివాహం జరిపించాలని ఆమె ఇంటిఎదుట తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను మీద పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడి మరణవార్త విన్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తులో ఉంది.


సాయిపవన్ (ఫైల్)

సఫిల్‌గూడ చెరువు అభివృద్ధికి చర్యలు

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. సోమవారం ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఎస్టీపీ ప్లాంట్, చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.83 లక్షలతో చెరువులో ఏడాది పాటు గుర్రపుడెక్క తొలగింపు పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. చెరువుకు కొంత భాగంలోనే వాకింగ్‌ట్రాక్ ఉందని, దానిని చెరువు చుట్టూ ఉండేలా చూడటంతో పాటు ఫెన్సింగ్ పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. చెరువులోకి మురుగు వదలకుండా ప్రజలు సహకరించాలన్నారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, డీఈ మహేష్, ఏఈ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలొద్దు..

మల్కాజిగిరిలోని బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేయడమే కాకుండా ఎమ్మెల్యేను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని కార్పొరేటర్ శ్రవణ్ ఆరోపించారు. ఎమ్మెల్యే పేరున జీహెచ్ఎంసీ అధికారులకు పలు అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ నాయకులు లేఖ అందజేశారన్నారు. గత నెలలోనే అభివృద్ధి పనులపై అధికారులతో కలిసి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నిధులు మంజూరైతే వారే చేయించామని గొప్పలు చెప్పుకోవడానికి చూస్తున్నారని, ఎమ్మెల్యే స్పందిస్తే ముఖాముఖి చర్చకు తాను సిద్ధమేనని స్పష్టం చేశారు.


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్